మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు

బెజ్జూర్: ఆలయంలోని రంగనాయకస్వామి విగ్రహం

బెజ్జూర్, మార్చి 5 : మండల కేంద్రంలోని అతి పురాతన రంగనాయక ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఇక్కడ శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. దీనికి అతి పురాతన చరిత్ర ఉన్నట్లు పెద్దలు పేర్కొన్నారు. 18వ శతాబ్దంలో కాకతీయ రాజుల నాటి కాలంలో బిజ్జూ అనే గోండు రాజు బెజ్జూర్ సామ్రాజ్యంగా కాకతీయ రాజుల సామంత రాజుగా పరిపాలించేవాడు. రైతుల వద్ద పన్నులు వసూలు చేస్తూ కాకతీయులకు కట్టేవాడు. బెజ్జూర్‌లో నాలుగు దిక్కులా సైన్యం కాపలా ఉండే ఎత్తైన ప్రదేశాలు, బురుజులు, స్నానాలు ఆచరించే కోనేరు ఆనవాళ్లు కనిపించేవి. కాలక్రమేనా అవి భూగర్భంలో కలిసిపోయాయి. రైతులు చెరుకు పండించే వారు. ఈ పంటలకు మత్తడి నుంచి పుష్కలంగా నీటి లభ్యత ఉండేది. చెరుకుతో బెల్లం తయారు చేసేవారు. మొన్నటి వరకు ''బెజ్జూర్ బెల్లం బేడకు తక్కెడు'' అనే నినాదం కూడా ఉండేది. బిజ్జూ హయాంలోనే మండల కేంద్రంలో రంగనాయక దేవాలయ నిర్మాణం జరిగినట్లు పెద్దలు చెబుతున్నారు. అందులో అతిపురాతన రంగనాయకుడి (అనంత నద్మనాభుడు) విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. అప్పటి నుంచి రంగనాయక స్వామి బెజ్జూర్ ప్రాంత వాసుల కోరికలు తీరుస్తూ కొంగుబంగారమై నిలిచాడని ప్రజల నమ్మకం.

మూడు రోజుల జాతర

రంగానయకస్వామి విగ్రహం ప్రతిష్ఠించినప్పటి నుంచి బెజ్జూర్‌లో పాడి పంటలు బాగా పండేవి. రంగనాయక, శివ, శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో శివరాత్రి జాతరకు చింతలమానెపల్లి, కౌటాల, పెంచికల్‌పేటతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారు. మూడురోజుల పాటు మండల కేంద్రంలో శివనామస్మరణ మార్మోగుతుంది. మొదటిరోజు భక్తులు ప్రాణహితనదిలో స్నానాలు ఆచరించి దైవ దర్శనం చేసుకుని, జాగారాలు చేసి, ఉపవాస దీక్షలు చేపడుతారు. జాగరణ కోసం ఆలయ కమిటీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

జాతరను విజయవంతం చేయాలి

తిర్యాణి, మార్చి 5 : చెలిమెలవాగు ప్రాజెక్ట్ కొండ ప్రాంతంలో కొలువైన నాగోబా క్షేత్రం వద్ద ఈ నెల 8న నిర్వహించనున్న మహాశివరాత్రి జాతరను విజయవంతం చేయాలని నిర్వాహకులు ఆత్రం గోపాల్, వెడ్మ వాసుదేవ్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని కుమ్రంభీం చౌరస్తాలో మండలంలోని ప్రజాప్రతిధులు, ఆదివాసీ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం గోడప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో పాటు మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ జిల్లా సర్మేడీ కుర్సెంగ మోతీరాం పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 5: ఈస్‌గాం శివమల్లన్న స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించే జాతరకు వచ్చే ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాలని ఆర్డీవో సురేశ్ సూచించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇక్కడ ఆలయ ఈవో గర్రెపెల్లి వేణుగోపాల్ గుప్తా, ఉత్సవ కమిటీ చైర్మన్ మురళీదర్, రూరల్ సీఐ నాగరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ద్వాదశ జోతిర్లింగ దివ్యదర్శనం

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, మార్చి 5: కాగజ్‌నగర్ లారీ చౌరస్తా వద్ద గల ఎస్పీఎం ఫంక్షన్ హాల్‌లో గురువారం బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో ద్వాదశ జోతిర్లింగ దివ్యదర్శనం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు దివ్యదర్శన కార్యక్రమంతో ప్రారంభమైశివరాత్రి వరకు కొనసాగుతాయని తెలిపారు. రాజయోగ ప్రవచనాలు, ఆధ్యాత్మికత, సహస్ర దీపాలంకరణ నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆసిఫాబాద్, మార్చి 5: ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులైన శానిటేషన్, పేషెంట్ టేకర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దౌత్రికి నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 6 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, ఈపీఎఫ్ వివరాలు తెలియజేయాలన్నారు. చట్టప్రకారం ఇవ్వాల్సిన పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు ఇవ్వాలని కోరారు. సీహెచ్‌సీల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు 6నెలల నుంచి వేతనాలు రాక అనేక ఇబ్బందులకు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులను ఎన్నిసార్లు అడిగినా దాటవేస్తున్నారని మండిపడ్డారు. సంవత్సర కాలంగా ఈపీఎఫ్‌ను ఏజెన్సీలు చెల్లించడలేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దివాకర్, కార్మికులు నవీన్, రమేశ్, చంద్రశేఖర్, పుష్ప, పద్మ పాల్గొన్నారు

మద్యం మత్తులో ఒకరి మృతి

కౌటాల, మార్చి 5 : కనికి పంచాయతీ పరిధిలోని ఎడ్లగూడకు చెందిన కట్టెకోల శంకర్ (36) మద్యం మత్తులో సోమవారం ఇంటి గడపై పడి మృతి చెందినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. ఎస్ఐ, శంకర్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల తన భూమిని కౌలుకు పెట్టడంతో రూ.36 వేలు వచ్చాయి. సోమవారం మద్యం మత్తులో ఉన్న శంకర్ బీరువాలో నుంచి డబ్బులు తీస్తుండగా భార్య కవిత వద్దని వారించింది. దీంతో భార్యను తన్నేందుకు ప్రయత్నించగా ఇంట గడపపై పడి తల వెనుక భాగంలో గాయమైంది. కుటుంబ సభ్యులు శంకర్‌ను చికిత్స కోసం కౌటాల, అక్కడి నుంచి కాగజ్‌గర్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు శంకర్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి రాంబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

క్రీడలతో బంగారు భవిష్యత్తు

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీడీ రమాదేవి

ఆసిఫాబాద్, మార్చి 5: క్రీడలతో బంగారు భవిష్యత్తు ఉంటుందని, విద్యతో పాటు క్రీడా నైపుణ్యాలు వెలికి తీయడానికి క్రీడా పాఠశాలలు దోహదపడతాయని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి పేర్కొన్నారు. క్రీడా పాఠశాలల ప్రవేశానికి మంగళవారం జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అవుతున్నట్లు వెల్లడించారు. క్రీడా పాఠశాలల్లో ఎంపికకు నాలుగో తరగతి చదువుతున్న బాలికలు 124, బాలురు 74 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన బాలురు ఉట్నూరులో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. 20 మంది క్రీడాకారులను బోయినపల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీకి పంపిస్తారన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, గిరిజన క్రీడాధికారి బండ మీనారెడ్డి, హెచ్ఎంలు కృష్ణారావు, సుధాకర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సాంబశివరావు, పేటా సెక్రటరీ కృష్ణమూర్తి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు భిక్కు, వినోద్, షరీఫ్, లక్ష్మణ్, మంగవతి, 40 మంది పీఈటీలు, 30 మంది పోషకులు తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపవద్దు

ఆసిఫాబాద్,మార్చి5: నంబర్ ప్లేట్‌లేని వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ సతీశ్ హెచ్చరించారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలో నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 40 వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. వాహదారులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. చాలా మంది వాహనాలకు నంబర్ ప్లేట్ ధరించకుండా నడుపుతున్నారన్నారు. సంఘ విద్రోహులు నంబర్ లేకుండా వాహనాలు నడిపి చైన్ స్నాచింగ్, దొంగతనాలు, మహిళలను బైకుల ద్వారా వెంబడించడం చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉండాలని సూచించారు.

స్పెషల్ డ్రైవ్

రెబ్బెన, మార్చి 5: గోలేటి ఎక్స్‌రోడ్‌లో మంగళవారం ఎస్ఐ చంద్రశేఖర్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. నంబర్ ప్లేట్‌లేని వాహనాలు నడపడంతో ప్రమాదం జరిగినప్పుడు కారకులను గుర్తించడం కష్టమవుతుందన్నారు. నంబర్ లేకుండా వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ కానిస్టేబుళ్లు మహేందర్, అంజన్న ఉన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి నంబర్‌ప్లేట్ ఏర్పాటు చేయిస్తున్న సీఐ సతీశ్

స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా, డివిజన్ అధ్యక్షులు కోవ విజయ్,గేడం సుభాష్

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్

తిర్యాణి,మార్చి 5 : షెడ్యూల్ ప్రాంతాల్లో వెంటనే స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, డివిజనల్ అధ్యక్షుడు గేడం సుభాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు తొడసం భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలోనే ఆదివాసీ స్పెషల్ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ఆర్డినేషన్ జారీ చేసి ఆదివాసీలకు వందశాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. జీవో నం 3ను పునరుద్ధరించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో వేలాదిగా యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సీఆర్టీల స్థానంలో రెగ్యులర్ నియామాకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ఏరియా ప్రాంతంలోని ఖాళీగా ఉన్న 29 డిపార్ట్‌మెంట్లలో నియామకాలు చేపట్టి నిరుద్యోగ శాతాన్ని తగ్గించాలన్నారు. స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ వేయని పక్షంలో అదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ)ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఐటీడీఏ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంతరావు, జిల్లా కార్యదర్శి అత్రం గోపాల్, డివిజనల్ ప్రధాన కార్యదర్శి కోట్నాక రాంషావ్, విద్యార్థి సంఘం మండలాధ్యాక్షుడు వల్క శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి రాయిసిడాం వినోద్, సర్‌మేడీ సోయం భీంరావు, కనక ప్రకాశ్, నగేశ్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్ష

బెజ్జూర్: కళాశాల ఆవరణలో సీఐ సాదిక్ పాషా తదితరులు

తిర్యాణి,మార్చి 5 : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు సీఎస్, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు తెలిపారు. గణితం, బాటనీ, సివిక్స్ పరీక్షలకు మొత్తం 213 మంది విద్యార్థులకు గాను 193 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ తిరుపతి కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిట్టింగ్ స్క్వాడ్ శ్యాంమూర్తి, డీవో వెంకటేశ్వరీ, ఇన్విజిలేటర్లు ఉన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సదర్శించిన సీఐ

బెజ్జూర్, మార్చి 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం కౌటాల సీఐ సాదిక్ పాషా సందర్శించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

దుబారా ఖర్చులను నియంత్రించాలి

ఝరి రాయిసెంటర్‌లో మాట్లాడుతున్న ఆదివాసీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్‌రావ్

కెరమెరి, మార్చి 5: వివాహ వేడుకలను సంప్రదాయ రీతిలో నిర్వహిస్తూ, దుబారా ఖర్చులను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని ఆదివాసీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ ఆత్రం లక్ష్మణ్‌రావ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఝరి గ్రామంలో మండలంలోని రాయిసెంటర్ల నాయకులు, పటేళ్లు, గ్రామపెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పెండ్లి వేడుకలు ఆచార వ్యవహరాలతో జరుపుకొంటూ, కట్న, కానులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలో నిర్వహించే శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర వేడుకలు ఈ నెల 17లోపు నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్, ఎస్పీ, తహసీల్దార్, ఎస్ఐలకు వినతి పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయిసెంటర్, రాజ్‌గోండ్ సేవాసమితి, ఆదివాసీ సంఘాల నాయకులు ఆత్రం బొజ్జిరావ్, రాయిసిడం జంగు, కుడ్మెత సోము, మడవి రఘునాథ్, పెందోర్ దంబీరావ్, కనక శంకర్, కుర్సేంగా దందురావ్, కుమ్రం నానేశ్వర్, మారు, దౌలత్‌రావ్, ఆత్రం నాందేవ్, కుర్సేంగా బారిక్‌రావ్ పాల్గొన్నారు.

మహిళలు అర్థికాభివృద్ధి సాధించాలి

మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్

ఆసిఫాబాద్, మార్చి5: మహిళలు అర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ సూచించారు. తుంపల్లిలోని మహిళా సంఘాలకు మంజూరైన రూ. 1.10 కోటి చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వాటర్ షెడ్, స్త్రీ నిధి ద్వారా మంజూరైన చెక్కును మహిళా సంఘాల సభ్యులకు అందజేశామన్నారు. మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో రుణాలు చెల్లించాలని తెలిపారు.కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్‌హైమద్, ఎంపీఎం శ్రీనివాస్, స్త్రీ నిధి మేనేజర్ హొక్టు, సీసీలు హన్మంతు, మంగ, వీవోఏలు సుదర్శన్, ధర్మారావ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా కారుణ్య నియామక ఇంటర్వ్యూలు

గోలేటి జీఎం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సింగరేణి అధికారులు

రెబ్బెన, మార్చి 5: సింగరేణిలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన, మెడికల్ ఇన్‌వాలిడ్ ఉద్యోగుల వారసులకు పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించామని బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూజీఎం నరేందర్ తెలిపారు. గోలేటి జీఎం కార్యాలయంలో మంగళవారం కారుణ్య నియామకం కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం(సివిల్) సతీశ్‌బాబు, డీజీఎం(సీహెచ్‌పీ) భీంరావు, సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్, సీనియర్ పీవో ప్రశాంత్ ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, మార్చి 5: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి జిల్లా అధికారి సుశీల్‌బాద్ హాజరై నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. కాగజ్‌నగర్ ఐసీటీసీ కో-ఆర్డినేటర్ హరీశ్ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ రాజు, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ మోతీరాం, అధ్యాపకులు జనార్దన్, వెంకటేశం పాల్గొన్నారు.

'విద్యానిధి'కి దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్,మార్చి 5: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి అర్హులైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి సజీవన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హత కలిగి ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు ఈ నెల 31లోగా http://telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, మార్చి 5: కాగజ్‌నగర్ మండలం ఈస్గాంకు చెందిన మహిపాల్ కు సంబంధించిన వీవో మొబైల్, గన్నారంనకు చెందిన వినేశ్‌కు సంబంధించిన రియల్‌మీ మొబైల్ పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు మంగళవారం సెల్‌ఫోన్లు అప్పగించారు. ఈ సందర్భంగా ఈస్గాం ఎస్ఐ రామన్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్ పోయిన లేదా దొంగిలించబడినా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేస్తే మొబైల్ ట్రేస్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. దీనికోసం మొబైల్ లో ఉన్న సిమ్ నంబర్‌తో కొత్త సిమ్ తీసుకొని ఐఎంఈఐ నంబర్‌తో మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొబైల్స్ ట్రేస్‌లో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ నయీంను అభినందించారు. ఇక్కడ ఏఎస్ఐ హీరామన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పల్స్‌పోలియో

దహెగాం, మార్చి 5: మండలంలో గత మూడు రోజులుగా నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. జీరో నుంచి ఐదు సంత్సరాలలోపు చిన్నారులు మండలంలో 3706 మంది ఉన్నట్లు తెలిపారు. కాగా లక్ష్యానికి మించి 3805 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి స్పందన తెలిపారు. మొదటి రోజు బూత్‌లు వద్ద పోలియో చుక్కలు వేయగా రెండో రోజు ఇంటింటికీ తిరిగి వేశామన్నారు. మూడో రోజు గ్రామాల వెలుపల ఉన్న వలస కార్మికుల పిల్లకు పోలియో చుక్కలను వేశామిన తెలిపారు. ఇందుకోసం 58 బూత్‌లను ఏర్పాటు చేయగా 260 మంది సిబ్బంది విధుల్లో పాల్గొన్నట్లు వైద్యాధికారి పేర్కొన్నారు. ఇక్కడ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

రెబ్బెన, మార్చి 5: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా కు మండలం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు.

నేడు మహిళలకు క్రీడా పోటీలు

రెబ్బెన, మార్చి 5: బెల్లంపల్లి ఏరియా గోలేటిటౌన్‌షిప్ సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు బుధవారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటన లో తెలిపారు. పర్సనల్ డిపార్టుమెంట్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారందరూ సాయంత్రం 4 గంటలకు రావాలని సూచించారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, మార్చి 5: బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న బీమాను సద్వినియోగం చేసుకోవాలని వాంకిడి బ్యాంకు మేనేజర్ నందకృష్ణ సూచించారు. మొకాసిగూడకు చెందిన కోట్నాక రఘునాథ్ మృతి చెందగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. దీంతో మంగళవారం బ్యాంకులో మృతుడి భార్య కోట్నాక పోతాబాయికు మేనేజర్ చెక్కు అందజేశారు.కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వివేక్, సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు భిక్షపతి, పోతాబాయి ఉన్నారు.

20న నిత్యాన్నదాన సత్రం ప్రారంభం

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 5: నియోజకవర్గ ప్రజలకు ఒక్కపూట భోజనం అందించేందుకు ఏర్పాటు చేసిన కోనేరు కోనప్ప నిత్యాన్నదాన సత్రాన్ని ఈ నెల 20 నుంచి పునఃప్రారంభించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కోనేరు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా అధికారుల ఆదేశాల మేరకు నిత్యాన్నదాన సత్రాన్ని మూసివేశారన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 5: సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తౌటం శ్యాంసుందర్, ముడిమడుగుల తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో కేజీబీవీ ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు రసీదులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి స్వామి, జిల్లా ట్రెజరర్ గజానన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్వార్టర్స్‌లో కార్మికులే ఉండాలి

రెబ్బెన, మార్చి 5: బెల్లంపల్లి ఏరియా లోని సింగరేణి క్వార్టర్స్ లో సింగరేణి కార్మికులే ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్